మహిళల ఓట్లే అధికం

- జిల్లాలో 20,14,794 మంది ఓటర్లు
- పురుషులు 9,94,885, మహిళలు 10,19,597
- అత్యధికం పాణ్యంలో 3,22,494
- అత్యల్పం మంత్రాలయంలో 2,05,429

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల జాబితాలో జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 20,14,794 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం తుది ఓటర్ల జాబితాలో ప్రకటించారు. ఇందులో పురుష ఓటర్లు దాదాపు 9,94,885 మంది ఉండగా మహిళా ఓటర్లు 10,19,597 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధికంగా పాణ్యం నియోజకవర్గంలో 1,57,113 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా మంత్రాలయం నియోజకవర్గంలో 1,00,732 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో దాదాపు 94,908 మంది బోగస్ ఓటర్లను గుర్తించి వాటిని తొలగించినట్లు తుది ఓటర్ల జాబితాలో వెల్లడించారు. ఇంకా కర్నూలు జిల్లాలో అత్యధికంగా బోగస్ ఓటర్లు కూడా ఉన్నట్లు, వాటిని కూడా తొలగించాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. ఈ ఓటర్ల జాబితాలో 18 నుంచి 19 ఏళ్లలోపు వయస్సు కలిగిన ఓటర్లు దాదాపు 44,273 మంది ఉన్నారు. 80 ఏళ్ల పైబడిన ఓటర్లు దాదాపు 24,478 మంది ఉన్నారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 1602 మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు 111 మంది దాకా ఉన్నట్లు జాబితాలో వెల్లడించారు.

ఓటరు జాబితాను ప్రకటిస్తున్న కలెక్టర్ సృజన

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు
కర్నూలు	2,70,942	131,150	1,39,760	32
పాణ్యం	3,22,494	1,57,113	1,65306	75
పత్తికొండ	2,10,639	1,09,673	1,09,943	23
కోడుమూరు	2,41,767	1,21,050	1,20,703	14
ఎమ్మిగనూరు	2,43,067	1,19,769	1,23,253	45
మంత్రాలయం	2,05,429	1,00,732	1,04,677	20
ఆదోని	2,57,529	1,27,798	1,29,682	49
ఆలూరు	2,53,927	1,27,600	1,26,273	54

నిర్బంధాన్ని ఆపాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి - అంగన్వాడీల అరెస్టును ఖండిస్తూ సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై చేస్తున్న నిర్బంధాన్ని ఆపాలని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. అంగన్వాడీ దీక్షల భగ్నం చేయడమే కాకుండా అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కేంద్రంలో అంగన్వాడీ యూనియన్ల నాయకులు గత ఐదు రోజుల నుండి ఆమరణ నిరాదీక్ష చేస్తున్న వారిని భగ్నం చేయడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తుంటే సహించని రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధానికి పూనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. 42 రోజులుగా అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్తే ప్రభుత్వం కనీసం వారి సమస్యలను పరిష్కరించడానికి సిఎం దృష్టి సారించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పుడు వారిని ఏకంగా తొలగించి కొత్త నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం అప్రజా స్వామికమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పద్ధతి అనుసరిస్తే రాష్ట్ర బంద్ వరకు పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా అంగన్వాడీ యూనియన్ల నాయకులతో చర్చించి అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శులు రాజశేఖర్ రాముడు, జిల్లా నాయకులు నారాయణ, ఆనంద్ బాబు, నాగేష్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు నిరసన చేపడుతున్న నాయకులు

పటిష్టంగా గణతంత్ర వేడుకలు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్స్

గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో చేయాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను విధిగా నిర్వర్తించాలన్నారు. వేడుకలు నిర్వహించే మైదానాన్ని సిద్ధం చేయాలని, పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, ప్రోటోకాల్ బాధ్యతలు, సీటింగ్ ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు గత ఏడాది మాదిరిగానే నిర్వహించాలని, ఈ ఏడాది మరిన్ని విభిన్నమైన తెలుగు పాటలను ఎంపిక చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏడాదిలో జిల్లా సాధించిన ప్రగతి విశేషాలను తెలియపరుస్తూ శకటాలను ప్రదర్శించాలన్నారు. అందరూ సమన్వయంతో చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మెరుగైన సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, డిఆర్ఒ కె. మధుసూదన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన

-చేతులకు సంకెళ్లు వేసుకొని ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం పేరుతో చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన అంగన్వాడీలను అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్మిక సంఘాల విజయవాడ పిలుపును భగ్నం చేస్తూ జిల్లావ్యాప్తంగా పోలీసులు ఇంటిదగ్గర, పోలీస్ స్టేషన్లలో నాయకులను నిర్బంధించారు. అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్ష శిబిరం నుంచి కలెక్టర్ వరకు తాళ్లతో బందించి బలవంతంగా సంకెళ్లు వేసుకొని వినూత్న నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, ఐఎన్‌టియుసి నాయకులు భాస్కర్, మధు, సిఐటియు నగర కార్యదర్శులు సిహెచ్ సాయిబాబా, మారెళ్ళ విజయ రామాంజనేయులు, సిఐటియు నగర నాయకులు కే,సుధాకరప్ప, ఎస్.మహమ్మద్ రఫీ, కె. ప్రభాకర్ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 42 రోజులుగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే ప్రభుత్వం పెడచెవిన పెట్టడమే గాక ఉద్యమాన్ని పోలీసులతో అణచివేయాలని చూస్తుందన్నారు. అంగన్వాడీల కోరికలు న్యాయమైనవి కావడంతో వారి ఆందోళనలకు మద్దతు పెరుగుతుందన్న భయంతో ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయించిందన్నారు. పోలీస్ స్టేషన్లో నిర్బందిస్తూ వర్కర్లను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఉద్యోగాల్లో చేరకుంటే ఉద్యోగాలు ఉండవని కొత్తవారిని నియమిస్తామని భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న కాలంలో ప్రభుత్వానికే సంకెళ్లు వేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. సిఐటియు నాయకులు కె.రామకృష్ణ, మహమూద్, కుమార్, ఎఐటియుసి నాయకులు ఎం.చంద్రశేఖర్, ఐఎఫ్‌టియు నాయకులు అంగన్వాడీలు చౌడేశ్వరి, భారతి, మహేశ్వరి, విజయమ్మ, భాగ్యలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

సంకెళ్లు వేసుకుని నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

'రాంబొట్ల' ఛైర్మన్‌గా నగరూరు దీప్తి

- ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే, మేయర్ హాజరు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని శ్రీ రాంబొట్ల దేవాలయం నూతన ఛైర్మెన్ గా 46వ వార్డు కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు సతీమణి నగరూరు దీప్తి సోమవారం దేవాలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆమెతోపాటు నూతన డైరెక్టర్లుగా పి.యశోద, ఎం.శ్రీదేవీ, జి. రాజేశ్వరి, టి.రవికుమార్, జె.విజయ్ కుమార్, పెద్దయ్య, ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ ప్రమాణ స్వీకార ఉత్సవానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బి.వై రామయ్య పాల్గొన్నారు. ఛైర్మన్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి బాధ్యతలు, అవకాశం ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం పరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సమయంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, గడ్డంరామకృష్ణ, కార్పొరేటర్లు సుజాతమ్మ, పల్లవి, కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాసరావు, యూనుస్‌బాషా, వైసిపి నాయకులు కృష్ణ కాంత్ శర్మ, శేషు యాదవ్, ఖాదర్ బాషా, హకీమ్, కేదార్‌నాథ్, అక్బర్‌అలీ, మల్లేష్, లేపాక్షి, సూర్యమోహన్, వెంకీ, పురోహితులు, సోమశెట్టి, పెద్దలు, తదితరులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాంబొట్ల దేవాలయ ఛైర్మన్ దీప్తి ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే, మేయర్

పేపర్ ప్లేటు తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు గురురాఘవేంద్ర నగర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సహకారంతో ఏర్పాటు చేసిన 'ప్రగతి యూనిట్' పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో మున్సిపాలిటీల్లో జగనన్న మహిళా మార్టులు, జగనన్న ఈ- మార్ట్, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు వంటివి ఏర్పాటుచేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న తోడువంటి పథకాలతో ప్రతి సభ్యురాలిని స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేలా శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాలను మెరుగు పరుస్తున్నట్లు వివరించారు. ఇంటిని చక్కదిద్దుకునే మహిళలు వ్యాపారాన్ని విజయవంతంగా చేయాలన్నారు. ఒక్కో ప్రగతి యూనిట్‌కు సగటున రూ.2.50 లక్షల చొప్పున రుణం మంజూరు చేసేలా మెప్మాకార్యాచరణ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా శ్రీవిష్ణు పొదుపుగ్రూపు సభ్యురాలు బిసి సరోజకు రూ.2,11,300పేపర్ ప్లేట్ల యూనిట్‌కు మంజూరు చేశారన్నారు. మెప్మా పిడి ఎం.నాగశివాలీల, డిపిఆర్ఒ వెంకటలక్ష్మి , సిఎంఎం అండ్ ఐబి జి.మురళి టిఇఎల్‌హెచ్, జి.జిలాన్‌బాషా , సిఒ నగేష్ , పుణ్యవతి టిఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి ,కిరణ్మయి ఒబిలు , ఆర్ పి లు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ఉత్తమ సేవా అవార్డుల ప్రకటన

నిబంధనలు పాటించని విద్యుత్ సంస్థ

పైరవీలకు ప్రాధాన్యత ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు ఇచ్చే ఉత్తమ అవార్డులలో నిబంధనలు పాటించలేదని అలా పాటిస్తే రాత్రికి రాత్రికే ఎలా ప్రకటిస్తారని, తప్పుడు నిర్ణయాలు తీసుకున్న నిర్వహకులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు ఎండి. అంజిబాబు, ఎపి ఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షులు పి. నాగరాజు డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం నాడు, జనవరి 26 రిపబ్లిక్‌డే ప్రతి సంవత్సరం జిల్లాలో జరుపుకునే సర్కిల్ డే సందర్భంగా విద్యుత్ సంస్థ ఉత్తమ సేవలందించిన వారికి ఈ మూడు సందర్భాలలో ఉత్తమ సేవా అవార్డ్స్ ఇవ్వడం ఆనవాయితీ అని అన్నారు.ఉత్తమ సేవ అవార్డ్స్ నియమ నిబంధన ప్రకారం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులు, వారు విద్యుత్ సంస్థకు చేసిన కృషి, అభివద్ధిని గుర్తించడం, అదేవిధంగా వినియోగదారులకు మెరుగైన సేవలను పరిగణలోనికి తీసు కోవడం, ఫీల్డ్ లో ట్రాన్స్ ఫార్మర్స్ కాలిపోకుండా మెయింటెనెన్స్ చేయడంతో పాటూ విద్యుత్తు తీగలు లూజు లేకుండా సరైన చర్యలు తీసుకోవడం, దొంగతనంగా కరెంటు వాడకుండా ప్రతి ఒక్కరికితో డబ్బులు కట్టించి, వారికి మీటర్లు బిగించి, విద్యుత్ సంస్థకు రెవిన్యూ కలెక్షన్ పెంచడం, లైన్ లాస్ తగ్గించడం, ఫీల్డ్ స్కెచ్ కార్మికులు మెయింటినెన్స్ చేయడం, ఇంకా అనేక అంశాలతో పాటు అవినీతికి పాల్పడకుండా నిజాయితీతో పని చేసిన ఉద్యోగ కార్మికులకు గుర్తించి, కార్మికులకు ఉత్తమ సేవా అవార్డు ప్రకటించాలన్నారు. విద్యుత్ సంస్థ నియమ నిబంధనలకు విరుద్ధంగా రాత్రికి రాత్రికి నిబంధనలను తుంగలో తొక్కి కాక రాయుళ్లకు, పైరవీలు చేసేవారికి ఉత్తమ సేవా అవార్డ్స్ ప్రకటించమేంటని వారు ప్రశ్నించారు. ఉత్తమ సేవా అవార్డ్స్ రెండు కేటగిరీలుగా ప్రకటిస్తున్నారని ఇందులో ఒకటి వ్యక్తిగతమైనవి, రెండవది సామూహికంగా (డిస్ట్రిబ్యూషన్ సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ సర్కిల్) అవార్డ్స్ ఉంటాయి. గతంలో విద్యుత్ శాఖ అధికారులు కాకారాయుళ్లకు, పైరవీలు చేసే వారికి, అర్హత లేని వారికి ఈ అవార్డ్స్ ఇచ్చారని తెలిపారు. వాళ్లకుఇప్పటికైనా ఇలాంటి అవార్డ్స్ ఇచ్చేముందు నిబంధన ప్రకారం అన్ని సేవలను గుర్తించి, విద్యుత్ సంస్థ యాజమాన్యం, జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోని, నిబంధనల ప్రకారమే ఉత్తమ సేవా అవార్డ్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు

టిడిపివైపు ఆకర్షితులవుతున్న యువత

కర్నూలు టిడిపి ఇంచార్జి టి.జి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు యువకులు మొత్తం తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇస్తున్నారని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. జొహరాపురంలోని తప్పెడగేరిలో తిమ్మరాజ్ బృందం టిజి భరత్ సమక్షంలో టిడిపిలో చేరారు. అల్లాబకాష్ దర్గా సమీపంలో యువకులు టిడిపిలో చేరారు. టిజి భరత్ వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిజి. భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో దోమలకు రాజధానిగా కర్నూలు నగరం మారిపోయిందని అన్నారు. నగరంలో ఎటు చూసినా దోమలు దండయాత్ర చేస్తున్నాయన్నారు. నగరంలోని వీధుల్లో దోమల నివారణ కోసం పిచికారి చేయడానికి తమ ఫ్యాక్టరీ నుండి హైపో ద్రావణాన్ని ఉచితంగా ఇస్తానని, మున్సిపల్ అధికారులకు అవసరమైతే తనను సంప్రదించాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోతే ప్రజల ప్రాణాలకే ప్రమాదమన్నారు.. తప్పెడగేరి నుంచి పార్టీలో చేరిన వారిలో బుజ్జి, వెంకట్, చిన్నా, మద్దిలేటి, పాల్, ఉపేంద్ర, తదితరులు ఉన్నారు. దర్గా మసీదు వద్ద పార్టీలో చేరిన వారిలో సమీర్, జమీర్, అబ్దుల్ ఆజీజ్, బాబర్, తయాబ్, ఇషాక్, ఫరూక్, ఖలీల్, అయాజ్, రియాజ్, అవాద్, అవేస్‌లు ఉన్నారు.

స్పందించకుంటే సమ్మె ఉధృతం

- క్లాప్ డ్రైవర్ల హెచ్చరిక

-37వ రోజు తల కిందులుగా నిలబడి నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట క్లాప్ ఆటో డ్రైవర్లు తల కిందులగా నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి రఘు శేఖర్ అధ్యక్షత వహించారు. 37వ రోజు సమ్మెనుద్దేశించి ఓల్డ్ సిటీ సిఐటియు నగర నాయకులు డి.కుమార్ మాట్లాడారు. కార్మికులకు రావల్సిన 12 నెలలజీతాలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, పని భద్రత, వీక్లీ ఆఫ్‌లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని, న్యాయమైన డిమాండ్లతో శాంతి యుతంగా సమ్మె చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోక పోవడం చాలా దుర్మార్గమని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించక పోతే ప్రజలు, కార్మికులతో కలిసి మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయ కులు రఘు శేఖర్, నరేష్, నవీన్, బాబ్జి, పరమేష్ చంద్ర శేఖర్ పాల్గొ న్నారు.

తల కిందులుగా నిలబడి నిరసన తెలుపుతున్న క్లాప్‌డ్రైవర్లు

అంగన్వాడీలకు బెదిరింపు కాల్స్

పత్తికొండ ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట నిరసన

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ సూపర్‌వైజర్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి విధులుకు హాజరుకావాలని బెదిరింపు కాల్ చేస్తున్నారని అంగన్వాడీ టీచర్ల ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పత్తికొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో 42వ రోజు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సిఐటియు నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు ఆయాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విధులకు హాజరుకావాలని విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పత్తికొండ మద్దికెర తుగ్గలి సెక్టార్ పరిధిలోని అంగన్వాడి టీచర్లు ఆయాలు విధులకు హాజరుకావాలని సూపర్వైజర్లు బెదిరింపు కాల్స్ పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానసికంగా ఒత్తిడికి గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, ఉద్యోగం నుంచి తొలగించి మరొకరిని రిక్రూమెంట్ చేస్తామని సమ్మెను తప్పుదోవ పాటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకు పోరాట కొనసాగుతుందన్నారు. సిఐటియు నాయకులు గోపాల్, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి తాజ్ మహమ్మద్, అంగన్వాడి టీచర్లు కాంతమ్మ, పద్మజ, నీరజ, షాహజన్, రోమని శిరోమణి,రామలక్ష్మి హబీజ, నాగమణి పాల్గొన్నారు.

గూడూరు: విజయవాడలో అంగన్‌వాడీల ఆమరణ నిరాహార దీక్షలు భగ్నం చేసి దీక్షలో కూర్చున్న నాయకులను బలవంతంగా అరెస్టు చేసి హాస్పిటల్‌కు తరలించడాన్ని నిరసనగా గూడూరుబస్టాండ్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు ఇందుమతి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు అరుణ, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను 42 రోజుల నుండి రోడ్లపాలు చేశారన్నారు. అంగన్వాడీలు సమస్యలు పరిష్కారనానికి విజయవాడకు రాష్ట్ర కేంద్రానికి వెళ్లడానికి సిద్ధమైన అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడాన్ని ఖండించారు. అంగన్వాడి కార్మికులు అనంతమ్మ, అనురాధ, రత్నమ్మ, సుజాత, సునంద పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ముందు ధర్నా

కోడుమూరు : అంగన్వాడీల నిరాహార దీక్షలను భగ్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిఐటియు నాయకులు గఫూర్ మియా అన్నారు. 42వ రోజు కోడుమూరులోని పాత బస్టాండులో గాంధీ విగ్రహం ముందు సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న అధ్యక్షతన నిరసన తెలిపారు. సిఐటియు మండల అధ్యక్షుడు గఫర్ మియా చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కనికె లక్ష్మన్న మాట్లాడారు. ప్రాజెక్టు నాయకులు సూలమ్మ, విజయభారతి, అరుణాదేవి, హైమావతి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో నిసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆరోగ్య సేవలు భేష్

ప్రజాశక్తి-మద్దికేర

గుంతకల్ పట్టణంలో సాయి కృష్ణ పిల్లల హాస్పిటల్‌లో ఆరోగ్య సేవలు భేష్‌గా ఉన్నాయని మధనంతపురం టిడిపి యువ నాయకులు దేవేంద్ర తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన భార్యకు ఏడు నెలల కాలంలోనే మగ శిశువు జన్మించాడని అన్నారు. మగ శిశు వు అనారోగ్యంగా ఉండడంతో సాయిక్రిష్ణ హాస్పిటల్‌లో చేర్పించానన్నారు. గుండె, బరువు తక్కువ ఉండటం, తదితర సమస్యలతో బాధ పడుతుండగా ఆసుపత్రిలో ఉత్తమ వైద్య సేవలు అందించి తన కొడుకుని కాపాడారన్నారు. డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పవన్ కుమార్, నర్సులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్న దేవేంద్ర

బీసీ కాలనీలో నిలిచిన మురుగును పరిశీలిస్తున్న బీవీ

అధికారంలోకి వస్తే..
ఆర్‌డిఎస్ ద్వారా సాగునీరందిస్తాం

- 'బాబు ష్యూరిటీ'లో మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఆర్‌డిఎస్ కాలువ ద్వారా మండలంలోని చివరి ఆయకట్టుకు సాగునీరందించి తీరతామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా ఆదివారం రాత్రి గోనెగండ్ల నాయీ బ్రాహ్మణ కాలనీలో బస చేశారు. సోమవారం ఉదయాన్నే మొట్టివీధిలో పర్యటించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రహదారి వెంట వెళ్లాల్సిన మురుగునీరు గతంలో మొట్టివీధి వైపు మళ్లించడంతో ఆగిన మురుగునీటిని, సగంలో ఆగిన డ్రెయినేజీ కాలువ నిర్మాణాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి బీసీ కాలనీలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక మురుగునీరు నిలిచిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. సాయంత్రం శ్రీకృష్ణ దేవాలయం వద్ద సమావేశం నిర్వహించి రైతులు, మహిళలతో మాట్లాడారు. అక్కడి నుంచి కింది గేరి జనార్ధన్ వీధికి చేరుకొని అక్కడే స్థానిక నాయకుడు ఎన్‌వి.రామాంజనేయులు ఇంటి వద్ద రాత్రి బస చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీల నిధులను మళ్లించడం వల్ల గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడానికి కూడా నిధులు లేవని, మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి గ్రామాలు కంపు కొడుతున్నాయని తెలిపారు. మైనార్టీలు, బీసీ, దళిత మహిళలపై అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని, టిడిపికి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు ఎన్‌వి.రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, బేతాళ బడేసా, శ్రీధర్ నాయుడు, రంగస్వామి నాయుడు, రమేష్ నాయుడు, మదీనా, నూర్ అహ్మద్, గౌవుండా రహంతుల్లా, కొత్తింటి ఫక్రుద్దీన్, పూజారి చంద్ర, వెంకటేశ్వర్లు, పిల్లిగుండ్ల జయపాల్, లింగందిన్నె సందీప్ నాయుడు, టిడిపి సోషల్ మీడియా రాంపురం రఫీక్ పాల్గొన్నారు.

ఆగని వలస బండి...

- ఉపాధి దొరకక ఖాళీ అవుతున్న గ్రామాలు
- పెండింగ్‌లో పది వారాల ఉపాధి కూలిలు

ప్రజాశక్తి - ఆస్పరి

వర్షాలు కురవక, పొలాలు తడవక, పంటలు పండక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. పెట్టుబడి కూడా చేతికందని దయనీయ పరిస్థితి. ఉపాధి పనులకు వెళ్లి పనులు చేసుకుందామని అనుకున్నా కూలిలు పెండింగ్‌లో ఉన్నాయి. కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా లేక, గ్రామాల్లో కరువు చేరి ఉపాధి దూరమైంది. ఉపాధి కోసం ప్రజలు గ్రామాల నుంచి తెలంగాణ, బెంగళూరు, గుంటూరు వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

పిల్లలు బడిబాట వదిలి తల్లిదండ్రులతో కలిసి వలస బాట పట్టారు. సంక్రాంతి పండగకు వచ్చినవారు, పండగ అనంతరం గుంటూరు జిల్లాకు మిర్చి కోతకు బయల్దేరి వెళ్లారు. మండల కేంద్రమైన ఆస్పరితో పాటు హలిగేరి, చిగిలి, బిణిగేరి, తంగరడోణ, తోగలగల్లు, తురవగల్లు, కైరుప్పల, శంకరబండ, కారుమంచి, చిరుమాన్ దొడ్డి, బిల్లేకల్లు, యట్టకల్లు, అట్టేకల్లు, ఐనేకల్లు తదితర గ్రామాల నుంచి వందల కుటుంబాలు వలస వెళ్లాయి. పనులు లేకపోవడంతో పొట్ట చేత పట్టుకొని ఊరు వదిలి వెళ్తున్నారు. కుటుంబంలో నలుగురు ఉన్నా జాబ్ కార్డుకు వంద రోజులు పని దినాలు కల్పించాల్సి ఉంది. మండలంలో 460 మంది కూలీలు వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్నారు. జాబ్ కార్డులకు 50 రోజులు అదనంగా పని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ నేటికీ అమలు కాలేదు. మండలంలో 14,128 జాబ్ కార్డులు ఉన్నాయి. 11,842 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. రోజువారీ కూలి రూ.269 పడుతోంది.

ఆస్పరిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

1,826 మంది కూలీలు ఉపాధి పనులకు దూరంగా ఉన్నారు. పది వారాలుగా ఉపాధి కూలిలు పెండింగ్‌లో ఉన్నాయి.

గత్యంతరం లేక వలస వెళ్తున్నాం
- సుధాకర్, యట్టకల్లు గ్రామం

గ్రామంలో ఉపాధి దొరకక గత్యంతరం లేక పొట్ట చేత పట్టుకొని పిల్లాపాపలతో వలస వెళ్తున్నాం. వర్షాలు కురవక, పనులు లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా జీవితాలు మాత్రం మారడం లేదు.

పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలిలు చెల్లించాలి
- బాలకృష్ణ, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి

పెండింగ్‌లో ఉన్న పది వారాల ఉపాధి కూలిలు తక్షణమే విడుదల చేయాలి. వర్షాలు లేక రైతులు అల్లాడుతుంటే, చేసిన పనులకు కూలిలు రాక పోతే కూలీలు కుటుంబాలను ఎలా పోషిస్తారు. ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలి.

ఉపాధి పనులు కల్పిస్తున్నాం
- చక్రవర్తి, ఎపిఒ, ఆస్పరి

మండలంలో ఉన్న ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నాం. కూలీలు కూడా ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. 460 మంది కూలీలు వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్నారు. అదనంగా 50 రోజులు ప్రభుత్వం కల్పిస్తే వారికి కూడా పని కల్పిస్తాం. పెండింగ్‌లో ఉన్న కూలిలు విడుదలయ్యాయి. త్వరలో ఉపాధి కూలీల ఖాతాలకు డబ్బులు జమ అవుతాయి.

హోళగుంద : గత మూడు నెలలుగా ఉపాధి కూలిలు అందకపోవడంతో పల్లెల నుంచి పట్టణాలకు వలసలు ఆగడం లేదు. సంబంధిత అధికారులు సకాలంలో ఉపాధి కూలిలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధి కూలీలు మండిపడుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో వర్షాధారంపై ఆధారపడిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. పెట్టుబడి కూడా చేతికందకపోవడంతో వ్యవసాయం ఆధారపడిన రైతులూ ఆయా గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లారు. ప్రస్తుతం గ్రామాల్లో వేరే ఏ పనులు లేకపోవడంతో గత్యంతరం లేక ఉపాధి పనులకు వెళ్లారు. మూడు నెలలుగా నయా పైసా కూడా కూలి డబ్బులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక మూటముల్లే సర్దుకుని పట్టణాలకు బయల్దేరుతున్నారు.

ఉపాధి నిధులు ఎక్కడ..?

ఉపాధి హామీ చట్టం నిధులు ఎక్కడ అని ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి ఏర్పడినప్పుడు ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాల్సి ఉంది. ఉపాధి హామీ చట్టాన్ని నమ్ముకొని రోజూ పనులు చేసిన వారికి కూలిలు అందకపోతే 'ఉపాధి' ఎలా భరోసా ఏర్పడుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

త్వరలో నిధులు విడుదల : ఎపిఒ భక్తవత్సలం

త్వరలో ఉపాధి కూలిల నిధులు విడుదల అవుతాయని జిల్లా అధికారులు చెప్పారు. మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందకపోవడం మాట వాస్తవమే. ఏ రోజు కూలీల సంఖ్య ఆరోజు అప్‌డేట్ చేస్తున్నాం. మా దగ్గర ఎలాంటి ఆలస్యమూ జరగడం లేదు.

హోళగుందలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇంటి వద్దకే పాలన : వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు తెలుసుకుంటున్న జయ మనోజ్ రెడ్డి

సచివాలయ, వాలం టీరు వ్యవస్థను తీసుకొచ్చి ఇంటి వద్దకే పాలన అందించడం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆదోనిలోని 23వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం సంక్షేమ పథకాలు నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత టిడిపి పాలకులు 600 హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట విస్మరించారని విమర్శించారు. 2024లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా, సాయి ప్రసాద్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే రెట్టింపు పథకాలు అందిస్తారన్నారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, స్టేట్ డైరెక్టర్ రేణుక, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ ఫయాజ్, అశోక్, తాయన్న, ఎజాస్, మాలిక్, లాల్ బాషా, జహీర్, గణేష్, కౌన్సిలర్ భారతి, బాబా, మహదేవ్, బండి రామాంజి స్వామి, దాస్, భీమ్ సింగ్, వన్నూరప్ప, మహబూబ్ బాష, వీరేష్, మల్లి, కాశీం, అక్బర్, జలంధర్, ఆర్‌ఆర్ కాలనీ నాగరాజ్, అంజి, కల్బాయి కృష్ణ, ఫర్వాధ్ భాను, కౌన్సిలర్ రాజేశ్వర్ రెడ్డి, సన్నీ, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, రాము, ఈశ్వర్, సునాగ్, రామాంజి, సుగుణమ్మ, రాము, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, నారి నాగరాజ్, అయ్యప్ప పాల్గొన్నారు.

ఉరుకుందలో వేలంపాటలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన కార్యాలయంలో ఆన్‌లైన్ కం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. సోమవారం దేవాలయం సహాయ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో ఎండోమెంట్ అధికారి రాంప్రసాద్ పర్యవేక్షణలో వేలం పాటలు సాగాయి. బియ్యం, బ్యాళ్లు పోగు చేసుకునే హక్కు ఒక సంవత్సర కాల పరిమితి బహిరంగ వేలానికి పాట దారులు హాజరు కాలేదు. ఇద్దరు సీల్డ్ టెండర్ వేయడంతో టెండర్ బాక్సులు అధికారుల సమక్షంలో తీశారు. రెడ్డి మమత, ఉరుకుంద వారు రూ.18,00,111, శ్రీఈరన్న స్వామి ట్రేడర్స్, ఉరుకుంద వారు రూ.17,51,000, ఆన్‌లైన్‌లో ఒకరు టెండర్ బిడ్ వేశారు. ఇందులో రెడ్డి మమత హెచ్చు పాటదారునిగా నిలిచారు. దేవస్థానంలో అగర్బత్తి స్టాల్ నిర్వహణ కోసం పాటదారులు హాజరు కానందున టెండర్‌ను వాయిదా వేశారు. దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, కుమార్, వీరేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

మండల స్థాయి క్రికెట్ పోటీలు

ఆస్పరి : క్రీడాకారులను ప్రోత్సహించడానికి టిడిపి ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల మాజీ కన్వీనర్ తిమ్మన్న, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, ఎంపిటిసి రహీంతుల్లా తెలిపారు. సోమవారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు గాంధీ పార్కులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలస్థాయి పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.10,016, తాలూకా స్థాయిలో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.50,016 వేలు, రెండో బహుమతి రూ.25,016 కోట్ల సుజాతమ్మ చేతుల మీదుగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న జట్టు రూ.500 రుసుం చెల్లించి, తమ జట్ల పేర్లను ఈనెల 29లోపు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 9666356674, 7981617218, 9985444308, 9652075068 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. టిడిపి నాయకులు నారాయణ, నాగన్న, ఈశ్వర్, సతీష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి మండల మాజీ కన్వీనర్ తిమ్మన్న

శ్మశాన స్థలానికి హద్దులు చూపాలి

- కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో దళితుల శ్మశాన స్థలానికి హద్దులు చూపించాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిక్కప్ప, గ్రామ అధ్యక్షులు పరమేష్, గ్రామ నాయకులు మదిరే వీరేష్ మాట్లాడారు. దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా 70 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించారని తెలిపారు. హద్దులు చూపించడంలో ఆదోని తహశీల్దార్, మండల సర్వేయర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు లక్ష్మన్న, నాయకులు మహారాజు, ఈరన్న, చంద్ర, ఏలియా పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తూ
అంగన్వాడీల రాస్తారోకో

ప్రజాశక్తి - ఆదోని

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని దీక్షలో కూర్చున్న రాష్ట్ర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఆదోనిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రాస్తారోకో చేపట్టారు. ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీల రిలే దీక్షలు పద్మమ్మ, సరోజ, జానకి అధ్యక్షతన రిలే దీక్షలు చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, మండల అధ్యక్షులు రామాంజనేయులు, వీరారెడ్డి మాట్లాడారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి, జీతాలు పెంచేంత వరకు ఎన్ని రోజులైనా సమ్మెలో కొనసాగుతారన్నారు. అంగన్వాడీలు సోమక్క, రిజ్వానా, సరోజ, గీత, రేణుక, సుజాత, మీనా కుమారి, రిజ్వానా, ఉమా, ఆంథోనమ్మ, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **ఆస్పరిలో** అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 42వ రోజుకు చేరింది. సిఐటియు జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి రంగస్వామి, ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి, మల్లేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, పద్మ, సరోజ, విశ్వకుమారి, బేగం, లత, దస్తగిరమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అంగన్వాడీల సమ్మె 42వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలాక్షి, భీమేశ్వరి, లావణ్య, సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, టి.ప్రాణేష్, దేవిపుత్ర, అంగన్వాడీ వర్కర్స్ సుజాత, ద్రాక్షాయని పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. స్పందనలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, పట్టణ, రూరల్ కార్యదర్శులు శైలజ, నీరజ, మహేశ్వరి, హేమలత, లక్ష్మీదేవి, సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి వి.తిమ్మ గురుడు మాట్లాడారు. అంగన్వాడీలు గ్రేసమ్మ, మేరీ, సుమిత్ర, నాగేశ్వరమ్మ, నిర్మల, లత, రాణి, బండలత, యుఎం.నాగలక్ష్మి, మౌలాబీ, లక్ష్మీదేవి, వాణి, చీరమ్మ, శాంతి పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలో అంగన్వాడీల సమ్మె 42వ రోజు చేరింది. ప్రాజెక్ట్ ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య మాట్లాడారు. **ఆలూరులో** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల సమ్మె 42వ రోజుకు చేరింది. సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి కెపి.నారాయణస్వామి, సిపిఎం నాయకులు షాకీర్, కృష్ణ, మైనా, గోవర్ధన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, నాగరత్నమ్మ, పుష్పవతి, సుజాతమ్మ పాల్గొన్నారు.

ఆదోనిలో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన అంగన్వాడీలు

చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను అడ్డుకున్న కోసిగి పోలీసులు

వివాహ వేడుకల్లో దివాకర్ రెడ్డి సందడి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సూగూరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి హాజరయి సందడి చేశారు. సోమవారం చౌళ్ల ఆనంద్ ఆహ్వానం మేరకు గ్రామానికి చేరుకున్న దివాకర్ రెడ్డికి టిడిపి కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. చౌళ్ల ఆనంద్ కుమారుడు లక్ష్మన్న దంపతులను తలంబ్రాలతో ఆశీర్వదించారు. ఎస్సీ సెల్ నాయకులు సుజ్ఞానం, ఇజ్రాయేలు, దుబ్బన్న, నాగరాజు, గోపాల్ పాల్గొన్నారు.

కల్తీ నూనెతో ప్రాణాలతో చెలగాటం : సిపిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

కలగట్ల రోడ్డు సమీపంలో కల్తీ నూనెను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అమరావతి ఆయిల్ డిపోను సీజ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, ఎఐటియుసి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగరుడు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కలగట్ల సమీపంలో ఆయిల్ డిపోను ఏర్పాటు చేసుకుని, అధిక ధరలకు, కల్తీ నూనెను విక్రయిస్తున్న అమరావతి ఆయిల్ డిపోపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఐ నాయకులు మల్లికార్జున గౌడ్, విజయేంద్ర, రవి, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.

అప్సర్ బాషకు టిడిపి ఎంపీ టిక్కెట్ కేటాయించాలి

- ముస్లిం, మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు అప్సర్ బాషకు టిడిపి కర్నూలు ఎంపీ టిక్కెట్ కేటాయిస్తే మద్దతు తెలుపుతామని ఎమ్మిగనూరు జెఎసి నాయకులు జహీర్ అహ్మద్, గౌస్, ఇర్షాద్, ఇలియాస్ కోరారు. సోమవారం దరఖాస్తు చేసేందుకు విజయవాడ వెళ్తున్న అప్సర్ బాషకు ఎమ్మిగనూరులో స్వాగతం పలికి సన్మానించారు. అప్సర్ బాషకు టిక్కెట్ కేటాయిస్తే తమ జెఎసి తరఫున విజయానికి కృషి చేస్తామన్నారు.

అభయ రామ శిలా విగ్రహం ఏర్పాటు

- పీఠాధిపతులతో కలిసి పల్లకి మోసిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల శ్రీఅభయ రామ సేవా సమితి ఆధ్వర్యంలో 56 అడుగుల ఎత్తు గల శ్రీఅభయ రామ శిలా విగ్రహం ఏర్పాటు చేశారు. సోమవారం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మంత్రాలయానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి 48 అడుగుల శిలా విగ్రహం ఎదుట 56 అడుగుల శ్రీఅభయ రామ శిలా విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పీఠాధిపతుల ఆదేశాల మేరకు శ్రీమఠం ఆవరణంలోని యోగీంద్ర సభామండపం, గ్రామ దేవత మంచాలమ్మ ఆలయం వద్ద నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి దేవాలయం, సుజయీంద్ర నగర్, రామచంద్ర నగర్, రాఘవేంద్ర నగర్, శ్రీసుశమీంద్రతీర్థ చిల్డ్రన్స్ పార్కు, రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఆంజనేయస్వామి వాహనంగా శ్రీఅభయ రాముని శోభాయాత్ర భాజభజంత్రీలతో, మంగళ వాయిధ్యాలతో, బాణసంచా పేల్చుతూ నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పల్లకి మోసి భక్తులను ఉత్సాహ పరిచారు. అంతకుముందు పీఠాధిపతులు శ్రీఅభయ రామ శిలా విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. శ్రీరాముడు వనవాస సమయంలో మూడు గడియలు విశ్రమించిన రాయితో రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని తయారు చేసినట్లు చరిత్ర చెబుతోందని తెలిపారు. ఆయన నడిచిన స్థలంలో గతంలో బెంగళూరుకు చెందిన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 46 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ విగ్రహానికి ఎదురుగా ప్రస్తుతం 56 అడుగుల శ్రీఅభయ రామ శిలా విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విశాలమైన మైదానంలో చుట్టూ ప్రహరీ, పార్కు, వాటర్ ఫాల్స్, విద్యుత్ లైట్లు, సుమారు వంద ఎకరాలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రణాళిక ఉందని చెప్పారు. శ్రీఅభయ రామ సేవా సమితి నిర్వాహకులు కృష్ణమూర్తి, ద్వారకానాథ్, హరీష్ స్వప్న అనే భక్తుల కృషి శ్రీఅభయ రామ శిలా విగ్రహం ఏర్పాటులో ఉందని తెలిపారు. శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఎంపిటిసి జి.వెంకటేష్, గోర్కల్ కృష్ణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, బొంబాయి శివ, వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు. అలాగే శ్రీరాముని శోభాయాత్రలో కెడిసిసి మాజీ ఛైర్మన్ మాధవరం రామిరెడ్డి కుమారులు, టిడిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు. రాఘవేంద్ర సర్కిల్‌లో పల్లకిని మోశారు. ఆయన కుమారుడు రాకేష్ రెడ్డి ఉన్నారు.

పల్లకి మోస్తున్న పీఠాధిపతులు, ఎమ్మెల్యే

గుడిసె కృష్ణమ్మ కారు చోరీ

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి ఆదోని మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ కారు చోరీకి గురైంది. సోమవారం ఆమె మాట్లాడారు. ఆదివారం రాత్రి ఇంటి ముందు నిలిపిన గ్రీన్ కలర్ స్కార్పియో (ఎపి 21 ఎఫ్ 6102) కారును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. ఆగి ఉన్న వాహనానికి మరో వాహనానికి తాడు కట్టి లాక్కెళ్లినట్లు సిసి కెమెరాలో రికార్డు అయిందని చెప్పారు. తన ఇల్లు 3వ పట్టణ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా దొంగతనం జరగడం విచారకరమన్నారు. దొంగలు బయటి వారు ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, శ్రీకాంత్ రెడ్డి, మల్లికార్జున ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. చోరీని వెంటనే ఛేదించి వాహనం ఆచూకీ కనుగొనాలని వారు డిమాండ్ చేశారు. దొంగతనాలు జరగకుండా పహారా పెంచాలని పోలీసులను కోరారు.

వైపిఆర్ నగర్‌లో చోరీ

పట్టణ శివారులోని వైపిఆర్ కాలనీలోని ఐదు ఇళ్లల్లో దొంగతనం జరిగినట్లు బాధితులు సోమవారం తెలిపారు. వారం గడవకముందే పలు ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు నాంది అని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి తెలిపారు. సోమవారం మండలంలోని పాలకుర్తి, లక్కందిన్నె, మాచాపురం, తెర్నేకల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెర్నేకల్ గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, మాజీ సర్పంచి రాజన్న, సత్యరాజ్ ఆధ్వర్యంలో బాణసంచా, పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ తాను ఊహించని విధంగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లోనూ పర్యటించి వైసిపి శ్రేణులతో మమేకమై తనకు మద్దతు ఇవ్వాలని కోరతానని చెప్పారు. గ్రామాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఎంపిపి భర్త లుముంబా, వైసిపి నాయకులు పాలకుర్తి హర్షవర్ధన్ రెడ్డి, తపాలా శ్రీనివాసులు, ఉమాకాంతరెడ్డి, ప్రతాప్, చిన్న వెంకప్ప, ఆనంద్, జయన్న, కేశన్న పాల్గొన్నారు.

తెర్నేకల్ గ్రామంలో మాట్లాడుతున్న విరుపాక్షి

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోసిగి

పల్లెపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి తెలిపారు. సోమవారం కోసిగి మండలం పల్లెపాడు గ్రామ సచివాలయంలో ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ప్రతి గడపలోని ప్రజలతో మమేకమై సమస్యలను వింటూ, పరిష్కరిస్తూ ముందుకు సాగారు. 2024లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి గెలవడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తంచేశారు. ఎస్ఐ సతీష్ కుమార్, ఎంపిపి ఈరన్న, వైసిపి మండల అధ్యక్షులు బెట్టనగౌడ్, ఎఒ రాజు, ఎపిఒ జయరాం, ఎంఇఒ నాగేశప్ప, ఎఇఒ వీరేష్, ఎన్.నాగరాజు, జగదీష్ స్వామి, షౌఖత్ అలీ, బుళ్లి నరసింహులు, హాజీ ఉస్మాన్, మల్లికార్జున గౌడ్, దొడ్డి నర్సన్న, కామన్‌దొడ్డి నరసింహులు, లంకారెడ్డి, చింతకుంట ఈరన్న, వీరన్న గౌడ్, ఉరుకుందప్ప, నర్సయ్య, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మన్న, నరసింహులు, నేలకోసిగి లక్ష్మన్న, కొరివి నాగరాజు, బుడగ జంగాల అయ్యప్ప, విఆర్ఒ ఏసుదాసు, పిఎస్.వినోద్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

'స్పందన'లో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులకు సూచించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిష్కార వేదిక స్పందన నిర్వహించారు. తాను ఆర్మీలో ఉద్యోగం నిర్వహించి విరమణ పొందిన అనంతరం ప్రభుత్వం సర్వే నెంబర్ 594లో రెండెకరాల పొలం మంజూరు చేసిందని, ఆ భూమికి సంబంధించి ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని ఆదోని పట్టణానికి చెందిన కె.ఈరన్న కోరారు. నెట్టేకల్ గ్రామంలో రోడ్డులో అక్రమంగా మరుగుదొడ్డి నిర్మించారని, రోడ్డుకు అడ్డుగా ఉందని, విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సర్వే నెంబర్ 130/డిలో 1.47 ఎకరాల భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని నెట్టేకల్ గ్రామానికి చెందిన రంగయ్య కోరారు. కౌతాళం మండలం కామవరం గ్రామానికి సంబంధించిన సర్వే నెంబర్ 423/1లో 2.72 ఎకరాల భూమిలో 1979 సంవత్సరం నుంచి సాగులో ఉన్నామని, ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణకు గురైందని, విచారణ చేసి న్యాయం చేయాలని సురేష్ కోరారు. పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒ శ్రీనివాసులు, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌టిఒ శివారెడ్డి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కె.లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, డిప్యూటీ తహశీల్దార్ వలీ బాష పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా పరిహారం అందజేత

దేవనకొండ : మండలంలోని తెర్నేకల్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మెకానిక్ ఉరుకుంద భార్య వేదవతికి వైఎస్ఆర్ బీమా పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయం రూ.10 వేలను ఎంపిపి భర్త లుముంబా, పంచాయతీ కార్యదర్శి రాముడు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద రూ.లక్ష మంజూరు అవుతుందని, మిగిలిన రూ.90 వేలు కొన్ని రోజుల్లో లబ్ధిదారుని ఖాతాకు జమవుతుందని తెలిపారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితాను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

ఎర్రమట్టి మాఫియా..

- ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- ఒక్కరోజే 100 టిప్పర్లు, ట్రాక్టర్ల వరకు మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండల పరిధిలోని నల్లమల అటవీ సమీపం నుండి ఎర్రమట్టి జిల్లా హద్దులు దాటి యథేచ్ఛగా తరలిపోతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామ సమీపంలోని బసవాపురం పొలిమేరలో ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిని ఒక గ్రామ విఆర్ఎ కుమారుడు సొంతం చేసుకుని అధికార పార్టీ నాయకుని ద్వారా జెసిబిలతో మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు సమాచారం. సోమవారం తెల్లారుజాము నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని సుమారు వంద ట్రిప్పుల వరకు రవాణా చేస్తున్నా ఏ అధికారికి కనిపించకపోవడం పలు అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తోంది. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఎర్రమట్టిని అక్రమ రవాణా చేసి లక్షల రూపాయలు గడిస్తున్నారు. గాజులపల్లె గ్రామం గుంటూరు-విజయవాడ రహదారి పక్కనే ఉండడం, నిత్యం రద్దీ ప్రాంతం కావడంతో వాహనాలు అతివేగంగా మట్టిని

ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎర్రమట్టి

తీసుకు వెళ్తున్న సమయంలో ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని దర్జాగా తరలిస్తూ సంపాదనే ధ్యేయంగా మట్టి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిస్తున్నారు. ఎర్రమట్టిని ఇటుకల బట్టీలకు అక్రమంగా అమ్ముకుంటూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి పడుతుంది. ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన ఆదాయ వనరైనప్పటికీ యథేచ్ఛగా అక్రమంగా ఎర్రమట్టి తవ్వుకుంటున్నారు. అనుమతులు ఉన్నాయో లేదో అధికారులకే తెలియాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మేల్కొని వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సహజ వనరులను కాపాడి, ప్రకృతికి, రైతులకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో జెసిబితో తవ్వకాలు చేపట్టిన దృశ్యం

సమాచారం తెలిసిన వెంటనే మట్టి తవ్వకాలను నిలుపుదల చేశాం

బసాపురం గ్రామ సమీపంలోని పొలాల నుండి ఎర్రమట్టి తరలింపు సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి సంబంధిత అధికారులను పంపి నిలుపుదల చేశాం. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తే వారిపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.

- మహానంది తహశీల్దారు జనార్ధన్ శెట్టి.

ఓటర్ల తుది జాబితా విడుదల

- మహిళా ఓటర్లే అధికం - జిల్లాలో మొత్తం 13 లక్షల 72 వేల 91 మంది ఓటర్లు
- మహిళలు 6,98,404, పురుషులు 6,73,425, ఇతరులు 262

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 లక్షల 72 వేల 91 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 6 లక్షల 73 వేల 425 మంది, మహిళలు 6 లక్షల 98 వేల 404 మంది, ట్రాంజెండర్స్ 262 మంది ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ప్రకటించారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 24,979 మంది అధికంగా ఉన్నారు. పాణ్యం నియోజకవర్గలో మొత్తం ఓటర్లు 3,22,494 మంది ఉండగా పురుషులు 1,57,113, మహిళలు 1,65,306, ఇతరులు 75 ఉన్నారు.

పారదర్శకమైన తుది ఓటర్ల జాబితా సిద్ధం : కలెక్టర్

జిల్లాలో స్వచ్ఛమైన, పారదర్శకమైన తుది ఓటర్ల జాబితాను రూపొందించామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తుది ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి జాబితా ప్రతులను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచించిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామని చెప్పారు. జిల్లా 1706 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. 8 వేల మంది చెంచు జనాభాలో 5,454 మందిని ఓటర్లుగా నమోదు చేశామన్నారు. 18-19 సంవత్సరాల మధ్య యువ ఓటర్లు 30,165 మంది ఉన్నారని తెలిపారు. 16,723 ఫోటో సిమిలర్ ఎంట్రీస్, 2,728 డెమో గ్రఫీ సిమిలర్ ఎంట్రీస్‌ను కూడా సరి చేశామనివివరించారు. జంక్ క్యారెక్టర్స్, 10 ఓటర్లకు కన్నా ఎక్కువగా ఉన్న కుటుంబాలను కూడా క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన చేయించి ఓటరు జాబితాలో సరి చేశామని తెలిపారు. డిఆర్‌ఒ పుల్లయ్య, కాంగ్రెస్ తరపున సయ్యద్ రియాజ్ బాషా, టిడిపి రమణారెడ్డి, శివరామిరెడ్డి, వైసిపి అనిల్ అమృతరాజ్, బిజెపి ఉపేంద్ర నాథ్ రెడ్డి, సిపిఐ నరసింహులు, బిఎస్‌పి తరపున శ్రీనివాసులు, ఆమ్ ఆద్మీ ప్రదీప్ పాల్గొన్నారు.

నియోజవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
1. నంద్యాల	1,30,278	1,37,273	94	2,67,647
2. ఆళ్లగడ్డ	1,14,311	1,16,589	14	2,30,914
3. శ్రీశైలం	94,910	99,009	43	1,93,962
4. నందికొట్కూరు	1,06,125	1,10,417	17	2,16,559
5. బనగానపల్లె	1,17,344	1,21,531	25	2,38,900
6. డోన్	1,10, 457	1,13,585	69	2,24,111
7. పాణ్యం	1,57,113	1,65,306	75	3,22,494

అక్రమ అరెస్టులపై ఆగ్రహం

అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ నంద్యాలలో ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

- అంగన్వాడీలను వదలిపెట్టాలని ర్యాలీ - ప్రధాన రహదారిపై బైఠాయింపు, ఆందోళన
- మద్దతుగా పాల్గొన్న సిపిఎం, సిఐటియు నాయకులు - అంగన్‌వాడీలను విడిచిపెట్టిన పోలీసులు

చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తుతన్న అంగన్‌వాడీ నాయకులను, కార్యకర్తలను, ఆయాలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నంద్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు, సిపిఎం, సిఐటియు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం రోజురోజుకు పెరిగిపోతోంది. అంగన్వాడీల సమ్మెను ఎలాగైనా విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుంది. విధుల్లో చేరకపోతే ఉద్యోగాల నుండి తొలగిస్తామని ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా హెచ్చరిస్తుంది. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ఎక్కడికక్కడ అరెస్టు చేయించి బెదిరింపులకు పాల్పడుతోంది. అయినా అంగన్వాడీలు మొక్కవోని దీక్షతో తమ హక్కుల సాధనకు ఆందోళన చేస్తున్నారు. ఉద్యోగాల నుండి తమను తొలగిస్తే ప్రభుత్వం కొరివితో తల గోక్కున్నట్లేనని అంగన్వాడీలు హెచ్చరిస్తున్నారు.

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చలో విజయవాడ కార్యక్రమానికి ఆదివారం రాత్రి నంద్యాల పట్టణం నుండి వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో, ఫంక్షన్ హాల్‌లో నిర్బంధించారు. ప్రభుత్వ, పోలీసుల దమన కాండను నిరసిస్తూ సోమవారం అంగన్‌వాడీలు, సిపిఎం, సిఐటియు నాయకులు నంద్యాల మున్సిపల్ కార్యాలయం నుండి రాజారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు బైటాయించి ఆందోళన చేపట్టారు. రూ. 26 వేలు వేతనం పెంచాలని, ఆదివారం రాత్రి అరెస్టు చేసిన అంగన్వాడీలను విడుదల చేయాలని నినదించారు. దీంతో నంద్యాల నుండి కర్నూలు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల వెళ్లే రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ **మిగతా 6వ పేజీలో...**

మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ నగీనా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై-1 షేక్ నగీనా అన్నారు. ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐ-1గా సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల మూడవ పట్టణ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న నగీనాను ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ట్రాఫిక్ సమస్య, పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని రవలకొండ మీద ఉన్న చెంచులక్ష్మి సమేత దేవస్థానంలో నాగుల విగ్రహాల ప్రతిష్ట సోమవారం వైభవంగా జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ అధ్యక్షులు ప్రధాన అర్చకులు బాలిశెట్టి పవన నరసింహమూర్తి ఆధ్వర్యంలో నాగుల విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు.

నాగుల విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

మర్రిపల్లెలో ఉత్సవ పల్లకి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పారువేట ఉత్సవాలలో భాగంగా అహోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకి సోమవారం మర్రిపల్లె గ్రామానికి చేరుకుంది. ఉత్సవ పల్లకికి గ్రామ సర్పంచి పత్తి తులసీశ్వర్ రెడ్డి, పత్తి రాజేశ్వరి దంపతులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవ పల్లకి గ్రామంలోని తెలుపులపై ఆశీనులై ప్రజల నుండి పూజలు అందుకుంది. గ్రామంలో తిరుణాల వాతావరణం నెలకొంది.

ఉత్సవ పల్లకి వద్ద మర్రిపల్లి నాయకులు

సమ్మెతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి

- బలవంతంగా విధుల్లో చేరాలని ఆదేశాలు - ఉద్యోగాల నుండి తొలగించేందుకు యత్నం
- జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు - నోటిఫికేషన్ల విడుదలకు అధికారులు సిద్ధం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీలపై ప్రభుత్వం ఉకు పాదం మోపడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. అయితే పట్టుసడలని అంగన్వాడీల ఉద్యమాన్ని చూసి ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరవుతుంది. అంగన్వాడీల సమ్మెను ఎలాగైనా విచ్చినం చేయాలనే లక్ష్యంతో 40 ఏళ్ల నుండి అంగన్వాడి వ్యవస్థలో పని చేస్తున్న టీచర్లను, ఆయాలను తొలగించడానికి ప్రభుత్వం సాహసం చేస్తుంది. సమ్మె చేస్తున్న అంగన్వాడీలు విధుల్లో చేరాలని, లేదంటే ఉద్యోగాల నుండి తొలగిస్తామని బలవంతంగా ఒత్తిడి తెస్తూ ప్రభుత్వం బెదిరిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని వైసిపికి చెందిన వారి కుటుంబాలను నియమించుకునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని అభిప్రాయం వ్యక్తమౌతుంది. సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు ఎస్మాను కూడా ప్రయోగించింది. అంగన్వాడీలు లెక్కచేయకుండా తమ సమస్యలు పరిష్కరించాలని షోకాస్ నోటీసులకు బదులిచ్చారు. అంగన్వాడీల సమాధానాలకు సంతృప్తి చెందని ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోగా వేగంగా వారిని ఉద్యోగాల నుండి తొలగించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. విధుల్లో చేరని అంగన్వాడీల స్థానాల్లో కొత్త వారిని నియమించుకోవాలని, రెండు రోజుల్లో ఖాళీల వివరాలు తెలుపుతూ నోటిఫికేషన్‌లు జారీ చేయాలని ఆదేశాలిచ్చింది. సమ్మెలో ఉన్న అంగన్వాడీల కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేస్తూ బెదిరిస్తుండడంతో విధిలేని పరిస్థితుల్లో కొంతమంది విధుల్లో చేరారు. జిల్లాలో అంగన్వాడీ సెంటర్లు 1663 ఉన్నాయి. అందులో 40 మినీ అంగన్వాడి సెంటర్‌లు ఉన్నాయి. అంగన్వాడి టీచర్లు 1,649, ఆయాలు 1570 మంది ఉన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు అంగన్వాడీల ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను బెదిరిస్తూ భయందోళనకు గురి చేస్తూ బలవంతంగా 654 మంది టీచర్లను, 636 మంది ఆయాలను, 19 మంది మినీ వర్కర్లు విధుల్లో చేరేలా చేసినట్లు సమాచారం.

అంగన్వాడీలను తొలగిస్తామనడం చట్ట విరుద్ధం

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించి, తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. గౌరవ వేతనం తీసుకుంటూ పని చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టం ఎలా ప్రయోగిస్తారు. వీరిపై ప్రభుత్వం పెత్తనం చేయడం చెల్లుబాటు కాదు. రెగ్యులర్ ఉద్యోగులపై, జీతాలు తీసుకునే వారిపై ఎస్మా ప్రయోగించ డానికి అవకాశం ఉంటుంది. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతాం.

ఎ.నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

80 శాతం అంగన్వాడీలు సమ్మెలో..

ఎర్రజెండా కింద సమ్మె చేస్తున్నామనేది ప్రభుత్వం గుర్తించుకోవాలి. రాజ్యాంగబద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను తొలగించే హక్కు ప్రభుత్వానికి లేదు. సిడిపిఒలు, సూపర్వైజర్ల బెదిరింపులతో 20 శాతం అంగన్వాడీలు మాత్రమే విధుల్లో చేరారు. ఇంకా 80 శాతం మంది సమ్మెలోనే ఉన్నారన్నది ప్రభుత్వం గుర్తించాలి. 43 రోజులుగా అంగన్వాడీలు ఎలాంటి బెదిరింపులకు, భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా తమ హక్కుల సాధన కోసం చేస్తున్నాం. సిఐటియు అండగా ఉంది. మా ఉద్యోగాలు ఎక్కడికి పోవు.. మా ఉద్యోగాలు ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు.

ఎం. నిర్మలమ్మ, జిల్లా కార్యదర్శి,
ఎపి అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ .

ఘనంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని కోరుమానుపల్లె గ్రామ సమీపంలో వెలసిన గుండం ఆంజనేయ స్వామి సన్నిధానంలో నూతనంగా నిర్మించిన పట్టాభి రాముడు స్వామి ఆలయంలో కోదండరామస్వామి విగ్రహాన్ని సోమవారం ఘనంగా ప్రతిష్టించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఇటిక్యాల బాల్ రెడ్డి రూ. 9 లక్షల వ్యయంతో ఒకే శిల్పంపై పట్టాభి రాముడుతో కూడిన 11 మంది దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. కార్యక్రమంలో ఇటిక్యాల బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు, గౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండయ్య గౌడ్, కోరుమానుపల్లె, అబ్దుల్లాపురం, ఉమ్మాయి పల్లె, తోళ్ళమడుగు, చింతలయపల్లె గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి
- ఘనంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, భద్రతా నియమ నిబంధనలకు కచ్చితంగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం నంద్యాల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపకూడదని చెప్పారు. వాహనము నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వాడకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించడం వల్ల జరిగే ప్రమాదాలు, కుటుంబానికి జరిగే నష్టాలు, కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోతే దానివల్ల వారి కుటుంబ సభ్యులు పడే వేదన గురించి ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీకాంత్, రవిశంకర్ నాయక్, జిటి నాయుడు, సుబ్బయ్య, కార్యాలయ ఏవో కురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి

విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, సుబ్బరాయుడు ఉపాధ్యాయులు

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీనివాసులు జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుబ్బారాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మిడుతూరులో జరిగిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ అండర్-14 పోటీలలో శ్రీనివాసులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 27 నుండి 30వ తేదీ చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థి ఎంపిక కావడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు షేక్షావలిని అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మేజర్ పంచాయతీలో రజక సంఘం నూతన కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. మొత్తం 150 కుటుంబాలకు గాను దాదాపు 500 ఓటర్లు కలిగిన రజకులు ఐకమత్యంగా చాకలి పెద్ద మద్దిలేటిని రజక సంఘం అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడుగా చిన్న మద్దిలేటి, కార్యదర్శిగా చిన్న బుడ్డన్న, గౌరవాధ్యక్షులుగా మద్దిలేటి, తిరుపాలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డిని కలిసి సంఘం సమావేశ భవనం భూమి పూజ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు.

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని కలిసిన రజక సంఘం నాయకులు

రిజిస్టర్ పత్రాలను ఈసీను చూపుతున్న రైతు వెంగన్న

రిజిస్టర్ పత్రాలు ఒకరివైతే.. పాసు పుస్తకాలు మరొకరికి

- రెవెన్యూ అధికారుల నిర్వాకం
- ఏళ్లుగా కార్యాలయం చుట్టూ ప్రదర్శనలు
- రైతు పూజల వెంగన్న ఆవేదన

ప్రజాశక్తి - పాములపాడు

భూమి కొనుగోలు చేసిన రిజిస్టర్ పత్రాలు ఉన్నా..ఏళ్ల తరబడి తిరుగుతున్నా.. తన భూమిని తన పేరుమీదుగా ఎక్కించకుండా రెవెన్యూ అధికారులు మరొక్కరికి పాసు పుస్తకాలు ఎలా ఇచ్చారని పాములపాడు మండలం జూటూరు గ్రామానికి చెందిన పూజల వెంగన్న రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. రైతు పూజల వెంగన్న సర్వే నంబర్ 740/బి1లో 0.20 (20 సెంట్లు) భూమిని 1999 సంవత్సరంలో కాపులపల్లి కోటారెడ్డి నుండి కొనుగోలు చేశాడు. ఆనాటి నుండి నేటికీ రెవెన్యూ అధికారులు అతనికున్న 20 సెంట్లు ఆన్లైన్ చేయలేదు. గతంలో ఉన్న అధికారులు కొన్నవారి నుండి పాసుబుక్‌లు తీసుకురండని చెప్పి కొన్ని సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిప్పిం చుకున్నారు. గత రెవెన్యూ అధికారులు పాసుబుక్‌లు కొన్నవారి నుండి తీసుకు రాకపోవడంతో వెంకన్న పేరు మీద ఆన్లైన్ చేయలేకపోయారు. లేకపోయి నప్పటికీని ఇతరుల పేరు మీద ఆ భూమిని ఎక్కించలేదు. గత రెవెన్యూ అధికారులు బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన అధికారులను సైతం రైతు కలసి తన రిజిస్టర్ పత్రాలను చూపించాడు. కానీ తాసిల్దారులను కలిసేందుకు కూడా అవకాశం కల్పించలేదు. ఎలాంటి రికార్డులు చూడకుండా ఎంజా య్మెంట్లో ఎవరు ఉన్నారన్నది గ్రామంలో విచారించకుండాకే జయమ్మ పేరు మీద రెవెన్యూ అధికారులు 20 సెంట్లు భూమిని ఆన్లైన్ చేశారు. ఈ విషయంపై విసుకు చెందిన రైతు మీడియా ముందుకు వచ్చి తన ఆవేదన వ్యక్తపరిచారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులు వారసత్వం భూములను కూడా ప్రభుత్వ భూమి అయ్యి ఉంటే యజమాని చనిపోతే వారి భార్య గాని కుమారులకు గాని ఎక్కించడం లేదు. ఈ విషయంపై చాలామంది రైతులు కార్యాలయం చుట్టూ తిరిగి విసుగు చెందిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ భూమి కాబట్టి వారసత్వం ఎక్కించడానికి కాదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కానీ పట్టా భూమి అయినా పూజల వెంగన్న కొన్న 20 సెంట్లు భూమిని ఈసీలో పేరు ఉన్నప్పటికీని అవేవీ పరిశీలించకుండా ఇతరుల పేరుపై చేసిన పరిస్థితి ఉంది. రైతు వెంకన్న తాను కొనిన 20 సెంట్లు భూమిని తన పేరు పైన ఆన్లైన్ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

తాసిల్దార్ వివరణ : ఈ విషయంపై తాసిల్దార్‌ను వివరణ కోరగా రైతు వెంగన్న తన దగ్గరికి రాలేదని ఆన్లైన్ కొరకు దరఖాస్తు చేసుకోలేదని వివరణ ఇచ్చారు.

నియోజకవర్గ 'ఆడుదాం-ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయా లని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని శోభారాణి కోరారు. ఆడుదాం ఆంధ్ర నందికొట్కూరు నియోజకవర్గస్థాయి క్రీడల సంసిద్ధత సమావేశాన్ని సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల వ్యాయామ ఉపాధ్యాయులతో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డోరతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని శోభారాణి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుండి 29వ తేదీ వరకు నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎటువంటి అవాంతరాలు లేకుండా అందరూ ఐకమత్యంగా పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ నియోజకవర్గ స్థాయి క్రీడలకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. వైఎస్ఆర్సీపీ శ్రేణులు, సిద్దార్థ రెడ్డి అభిమానులు, క్రీడా ప్రేమికులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. మున్సిపల్ కమిషనర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ క్రీడల విజయవంతానికి తమ సంపూర్ణ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియ జేశారు. అనంతరం నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో ఆర్డినేటర్‌లు స్వామి దాసు రవి కుమార్, శ్రీనాథ్ పెరుమాళ్ళ ఆధ్వర్యంలో జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల సమా వేశంలో ఈ క్రీడలు ఏ విధంగా నిర్వహించుకోవాలి, ఏ మైదా నంలో ఏ క్రీడలు నిర్వహించుకోవాలి, కన్వీనర్‌లు, గేమ్స్ ఇం ఛార్జిలను ఎవరిని నియమించుకో వాలి అనే అంశంలో ముం దస్తు ప్రణాళిక తయారు చేసుకున్నారు. మండల ఆడుదాం ఆంధ్ర కో-ఆర్డినేటర్‌లు వీరన్న, కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాజశేఖర్, మురళీ నాయక్ ఫిజికల్ డైరెక్టర్‌లు పద్మలత, జయమ్మ, జేసింత, విజయ కుమారి,అరుణ, స్వరూప,సుమలత, చంద్ర మోహన్, చెన్నమ్మ, ఊర్మిళ ముస్తహీర్,చంద్ర, శ్రీధర్ కుమార్,శివన్న, శ్రీనివా సులు, కౌన్సిలర్ లాలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దర్శనం అనంతరం బయటకు వస్తున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంలో ప్రముఖులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దర్శించుకున్న ప్రముఖులలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి, శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డిలు ఉన్నారు. వీరు ఇరువురు విడివిడిగా స్వామి అమ్మవారు దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ అధికారులు దేవాలయాల ప్రధాన అర్చకులు వేదపండితులు సంప్ర దాయం ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

గడ్డివాములు దగ్ధం

- రూ 1.50 లక్షల నష్టం

ప్రజాశక్తి - పగిడ్యాల

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, గ్రామస్తులు

మూడు గడ్డివాములు దగ్ధమై రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిన ఘటన మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మాపురం గ్రామానికి చెందిన చంద్ర, మద్దిలేటి అనే రైతులవి మూడు గడ్డివాములు దగ్ధమై పక్కనే ఉన్న గంగన్న మినుము పొట్టు వామి దగ్ధమైంది. నూతన సచివాలయం సమీపాన ఉన్న గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టింటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయోధ్యలో శ్రీరాముని పరమ ప్రతిష్ట విగ్రహం సందర్భంగా లక్ష్మాపురం గ్రామంలోని శివాలయం సమీపాన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలో అందరూ శివాలయం సమీపాన ఉండడంతో గుర్తిలేని వ్యక్తులు నిప్పు పెట్టింటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు స్పందించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో కర్నూలు నుంచి ఫైర్ ఇంజన్ ద్వారా సిబ్బంది మంటలు ఆర్పేశారు. గడ్డివాములు దగ్ధమై రైతులకు రూ1.50 లక్షలు నష్టం వాటిని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యతలకు నష్టపరిహారం అందిం చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాయి బ్రాహ్మణ కమిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - బేతంచెర్ల

భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, చైర్మన్ తదితరులు

బేతంచర్ల మండల కేంద్రంలోని నంద్యాల రోడ్డు బుగ్గన పల్లి రహ దారిలోని అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా నాయి బ్రాహ్మణ కమిటీ హాల్ నిర్మాణానికి బేతంచర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి సోమవారం నాడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ మాట్లాడుతూ నియోజక వర్గంలో కుల, మత, రాజకీయ తారతమ్య భేదాలు లేకుండా అందరికీ సమా నంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమాలను నిర్వహిం చడంలో ఆర్థిక మంత్రి చేసిన కృషి అమోఘమైనదన్నారు. మండలంలోని ప్రతి సామాజిక వర్గం ఐకమత్యంతో కలిసి ఉండాలని వారు అన్నారు. ఈ కార్య క్రమంలో నాయి బ్రాహ్మణ కమిటీ సభ్యులు ముద్దవరం మద్దయ్య, నారాయణ, వెంకటయ్య, రమణ ,పరమేష్, పవన్, రఘు, మద్దిలే స్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డ్ నందు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రజాశక్తి క్యాలెండర్-2024ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి క్యాలెండర్ ఎంతో సుందరంగా ఉంటుందని, క్యాలెండర్‌లో వచ్చే సీనరీస్ ఎంతో అందంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బిసిలకు టిడిపి పెద్దపీట

వై నాగేశ్వర రావు యాదవ్

ప్రజాశక్తి - ప్యాపిలి

రాజకీయ చరిత్రలోనే బిసిలకు టిడిపి పెద్ద పీట వేసిందని బిసి సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వర రావు అన్నారు. ప్యాపిలి పట్టణంలో సోమవారం జయహొ బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వైసీపీ అధికారంలో వచ్చిన నాటి నుంచి బీసీలకు రక్షణ కరువైం దని, వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టిడిపి జయహొ బీసి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపికి దక్కుతుందన్నారు. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి జగన్ మోహన్ రెడ్డి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. బీసీలకు కార్పొరేషన్‌లో ఏర్పాటు చేయడం మినహా ఒక్క రూపాయి నిధులు కూడా వెచ్చించలేదన్నారు. నియోజవర్గంలో బీసీ ప్రజాప్రతినిధులు కలిసిన గౌరవం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ కుమార్ రెడ్డి, రాఘ వేంద్ర, వలసల రామకృష్ణ, మల్లికార్జున, రామసుబ్బయ్య, రాంమోహన్ యాదవ్, సుంకయ్య,అంకిరెడ్డి, ప్రసాద్ రెడ్డి,చల్లా వీరా,సుదర్శన్,కొంగన పల్లె మధు,నాగేంద్ర, పెద్ద రామాంజి,మల్లికార్జున,ఎస్ కె వలి,కోదండ రామయ్య, ప్రిన్సిపాల్ మధు,బ్యాంకు శీను, చల్లా దీపు,రాంపురం నాగేశ్వరరావు, శివ కిశోర్, అక్బర్,జనసేన నాయకులు చంద్ర,మధు నాయుడు,ఆర్సిమద్దిలేటి, బాల రంగన్న తదితరులు పాల్గొన్నారు.

జయహో బిసి కార్యక్రమం లో మాట్లాడుతున్న వై నాగేశ్వర రావు యాదవ్

పట్టుబడ్డ మద్యం సీసాలను చూపిస్తున్న ఎస్ఐ జయ శేఖర్

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - పగిడ్యాల

అక్రమంగా మద్యాన్ని తరలిస్తుంటే పట్టుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్సై జయ శేఖర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన వాహనాలను తనిఖీ చేస్తుండగా గణపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 55 మద్యం సీసాలను మోటార్ సైకిల్‌పై అక్రమంగా తరలిస్తుంటే పట్టుకోవడం జరిగిందన్నారు. మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకుల కు రహదారి భద్రత పై శిక్షణ ఇస్తున్న డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.క్రాంతి కుమార్

రహదారి భద్రత నియమాలు పాటించాలి

- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.క్రాంతి కుమార్

ప్రజాశక్తి-డోన్

ప్రమాదాల నివారణ కొరకు రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్క వ్యక్తి రహదారి భద్రత నియమాలు పాటించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని ఎంవిఐ కార్యాలయం నందు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా రహదారి భద్రత కోసం స్వచ్ఛంద సేవకులను గుర్తించి వారికి రహదారి భద్రతపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వీరు రాబోవు రహదారి భద్రత కార్యక్రమాలలో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు సేవలను అందిస్తారని తెలిపారు.

వైసిపిని వీడి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - వెలుగోడు

మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన వైసిపి 19వ వార్డు సభ్యులు షఫీవుల్లా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జమల్ సా, షేక్ అహమ్మద్, వలి, నూరుద్దీన్, చాంద్‌లతో పాటు సిపి నగర్‌కు చెందిన 50 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరుతున్న నాయకులు

ఆత్మకూరులో కర్నూలు గుంటూరు రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రాస్తారోకోలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు

బేతంచెర్ల : రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎమ్మెల్యేను చుట్టుముట్టిన అంగన్వాడీలు

అక్రమ అరెస్టులపై ఆగ్రహం

5వ పేజీ తరువాయి.. నిలిచిపోయి ట్రాఫిక్ స్థంభించి పోయింది. దీంతో చేసేదేవిమీలేక పోలీసులు అదుపులోకి తీసుకున్న అంగన్వాడీలను వదిలిపెట్టారు. అంతకుముందు జరిగిన ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరిన అంగన్వాడీలను అక్రమంగా అరెస్టులు చేసి ఫంక్షన్ హాళ్లలో, రైల్వే స్టేషన్‌లలో పోలీసులు నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వం తీరు మారకపోతే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా గత 42 రోజులుగా అంగన్వాడీలు కనీస వేతనం అమలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని నిరవధిక సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసి, చివరకు బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. 42 రోజులుగా మహిళలు రోడ్లు ఎక్కాల్సిన దుస్థితిని తీసుకురావడం దుర్మార్గమన్నారు. జగన్‌కు అధికారం ఉందని సమస్యలను పరిష్కారం చేయకుండా, విజయవాడకు వెళ్లకుండా ఎక్కడికెక్కడ మహిళలను అర్ధరాత్రిలు స్టేషన్లో ఉంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియకుండా భయభ్రాంతులకు గురి చేయడం పద్ధతి కాదన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్ , కోశాధికారి పి.వెంకట లింగం, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు నాగరాణిలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేసేంతవరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాబోయే కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి, వైసిపికి పుట్టగతులు లేకుండా చేస్తామని, జగన్ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **మహానంది :** అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అపలేరని అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, నారాయణమ్మ, జ్యోతి ఉషారాణిలు పేర్కొన్నారు. మహానందిలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలను మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. **రుద్రవరం :** చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్తున్న అంగన్వాడీలను ఎక్కడికక్కడ రైల్వే స్టేషన్లలో, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద అరెస్టు చేయడం దారుణమని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్వాడీల వేతనాలను పెంచాలని, అరెస్టు చేసిన వాళ్లను వెంటనే వదలాలని, అక్రమంగా బనాయించిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. **నందికొట్కూరు టౌన్ :** అక్రమ అరెస్టులు ఆపాలని న్యాయమైన అంగన్వాడి కోర్కెలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు కోరారు. సోమవారం సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుండి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లా డుతూ అంగన్వాడి వర్కర్స్ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో సమస్యలు పరిష్కరించకుండా అంగన్వాడీ మహిళలను బెదిరించడం జరుగుతుందని వారు తెలిపారు. కోటి సంతకాలు సేకరించి జగన్‌కు చెబుదాం అనే కార్యక్రమాన్ని తీసుకొని సేకరించిన సంతకాలను సిఎం జగన్మోహన్ రెడ్డికి ఇచ్చేందుకు విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను ఎక్కడికక్కడే అరెస్టు చేసి నిర్బంధించడం దారుణం అన్నారు. శాంతియుతంగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న నాయకులను దౌర్జన్యంగా అరెస్టు చేశారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు బేస్తరాజు, నాగన్న, గోపాల్, ఆంజనేయులు, శ్రీని వాసులు, జయరాన్ని, యోసేపు, నరసింహ, ఏసన్న, నారాయణ, పకీరయ్య, రాఘవేంద్ర, డివైఎఫ్ఐ సీతారాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్, అంగన్వాడి వర్కర్ యూనియన్ నాయకులు మదర్ బి, ఉమాదేవి, లక్ష్మీదేవి, హరిత, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** చలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ వర్కర్లను, సిఐటియు, సిపిఎం నాయకులను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాని మేధావులు, లౌకికవాదులు, ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు కోరారు. నిర్బంధాలను వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అంగన్వాడీలు గుండెపోటు వచ్చి చనిపోతున్న సిఎం జగన్ గుండె కరగడం లేదని వారు అన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. రజాక్, ఏ. సురేంద్ర, ఎన్. స్వాములు, షైక్ ఇస్మాయిల్, జి. నాగేశ్వరావు, వీరన్న, టి. శివకుమార్ గణపతి, సతీష్, ఏ. కిరణ్, మల్లయ్య, రఫీ, నూర్, ఉసెన్ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** 42 రోజులుగా సమ్మె చేస్తున్న చర్చల పేరుతో కాలయాపన చేసి, బెదిరింపు జీవోలను అమలు చేసి, సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అంగన్వాడీలకు తొలగించి హక్కు ఎక్కడిదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఛలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలను, నాయకులను అరెస్టు చేయడం పట్ల నిరసనగా బేతంచెర్ల భారత్ బేకరీ సర్కిల్ నందు సిఐటియు జిల్లా నాయకులు, మోటార్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడలో శాంతియుతంగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్వాడీ నాయకులను, సిఐటియు నాయకులను దౌర్జన్యంగాతెల్లవారుజామున 3 గంటల సమ యంలో డిసిపి విశాల్ గున్ని నాయకత్వంలో వందలాది మంది పోలీసులు టెంట్‌ను పీకేసి, కరెంట్ తీసేసి దీక్షలో ఉన్న వారి పట్ల అమానుషంగా వ్యవహరించడం దారుణం అన్నారు. తక్షణం వారిని విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, సంఘాల నాయకులు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఏం. మధు శేఖర్, మహేశ్వర్ రెడ్డి, సిహెచ్. మద్దిలేటి స్వామి, జె. శ్రీనివాసులు, విష్ణు, గఫూర్ రాముడు, తిరుమలేశు, మునీంద్ర ఆచారి, షేక్షావలి, జాకీ, నాగరాజు, చిన్న వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రాజబాబు, నాగరాజు, రమణ, యువరాజు, రాజు, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు:** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్వాడీల సమ్మెలో భాగంగా అంగన్వాడీలు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సుండిపెంటలోని ఏపీ జెన్కో అతిథి గృహానికి వచ్చిన ఆయనను చుట్టు ముట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఎమ్మెల్యే బయటకొచ్చి అంగన్వాడీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కుటుంబాలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సమస్యలను త్వరలో సీఎం దృష్టికి తీసుకొనిపోతానని హామీ ఇచ్చారు.కొత్తగా అంగన్వాడీల భర్తీపై నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిసినదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అలాంటిది జరగకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఓబులయ్య, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదము, సిపిఐ మండల నాయకులు పులిరాజు, మల్లికార్జున అంగన్వాడి వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ యార్డు చైర్ పర్సన్ షేక్ రాహత్ అబ్దుల్ జబ్బార్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

పశు వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ షేక్ రాహత్ అబ్దుల్ జబ్బార్ రైతులకు సూచించారు. సోమవారం నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు పశువుల సంత నందు వెటర్నరీ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏడియం అబ్దుల్ రెహమాన్, మార్కెట్ యార్డు సెక్రెటరీ ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ లాలు ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో వైయస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవలు అందిస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ పశువులకు సంబంధించిన వ్యాధులపై సమస్యలను సంబంధిత అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం పశు వైద్యులు యస్.యం.డి ఇలియాజ్, యం.డి ఇర్ఫాన్, పారవెట్ కెజియా వెటర్నరీ వైద్యులు గేదెలు, గొర్రెలు, మేకలకు చికిత్స చేశారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ యార్డు డైరెక్టర్‌లు కావేటి రాముడు, ఉస్మాన్, జలీల్ అహ్మద్, కౌన్సిలర్ లాలు ప్రసాద్, మార్కెట్ రాజు, సలాం, ఆశం, వెటర్నరీ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

కర్నూల్ నుంచి డోన్‌కు రాత్రి 9 గంటలకు బస్సు

ప్రజాశక్తి-డోన్

కర్నూల్ నుంచి డోన్‌కు సోమవారం నుండి రాత్రి 9 గంటలకు ప్రయాణికులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం శశిభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిపూట డోన్ కు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందువల్ల ఈ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.డోన్ పట్టణ ప్రజలకు తెలియజేయడమేమనగా సోమవారం నుండి ఒక ఆర్డినరీ పల్లె వెలుగు బస్సు కర్నూలులో రాత్రి 9 గంటలకు బయలుదేరి డోన్‌కు పదిన్నరకు గంటలకు వయా వెల్దుర్తి మీదుగా వచ్చే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సర్వీసును ప్రయాణికులు ప్రజలు ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు.

కుల గణన సర్వే పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు : ఎంపిడిఓ

ప్రజాశక్తి - పగిడ్యాల

కుల గణన సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. కుల గణన సర్వే నత్త నడకన నస్తుందని సర్వే నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని సర్వే వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కుల గణన సర్వే పూర్తి కాకపోత వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతు ందన్నారు. కుల గణన సర్వే వేగవంతం చేయాలని లేనియెడల మీ జీతాలు నిలుపుదల చేస్తామని ఆయన హెచ్చరించారు. మండలంలో కుల గణన సర్వే నిర్లక్ష్యంగా చేస్తున్నారని అన్నారు.

ప్రజల దాహం తీర్చేందుకు ముందుంటాం

మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని 15వ వార్డు పరిధిలో అన్నా క్యాంటీన్ సమీపంలో బోరు నీరు పైపు లీకేజీ వృధాగా నీరు పోయే విషయాన్నిమున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే వాటర్ సిబ్బందితో మరమ్మతుల పనులను దగ్గర ఉండి చేయించారు. వార్డు ప్రజలు ఎంఏ రషీద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోపట్టణ ప్రజలకు వేసవికాలం ఆరంభమవుతున్న నేపథ్యంలో ప్రజల దాహం తీర్చేందుకు మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం ముందుంటుందని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ పేర్కొన్నారు. వీరి వెంట వైసిపి జిల్లా ఎస్సీ నాయకుడు మాజీ వార్డు కౌన్సిలర్ తిమోతి, పట్టణ వార్డు కౌన్సిలర్లు మిట్ట కందాల మహాబత్తుల కలిముల్లా, వైసిపి నాయకులు జెడ్డు శ్రీనివాసరెడ్డి, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.